క్లుప్తంగా

రహదారి నిబంధనలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ సురేష్

పాలసముద్రం: వాహనదారులు రహదారి నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఎస్‌ఐ బి.సురేష్ తెలిపారు. ఆదివారం సిబ్బందితో కలసి బలిజకండ్రిగ–షోళింగర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి జరిమానా వేశారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదని తెలిపారు. ఎఎస్‌ఐ చక్రవర్తి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ద్రౌపదీ కల్యాణం



కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంటలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు ఆదివారం మధ్యాహ్నం కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఆలయంలో ద్రౌపదీ దేవి, ధర్మరాజులు, భీమ, అర్జున, నకుల, సహదేవ ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం పాండువులు, శ్రీకృష్ణ ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. తదుపరి ఆలయ ఆవరణ ద్రౌపదీ, ధర్మరాజుల వారి ఉత్సవ మూర్తులను వేదికపై కొలువుదీర్చి పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణలు నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు కల్యాణాన్ని తిలకించి తన్మయత్వం చెందారు. మధ్యాహ్నం కల్యాణోత్సవం హరికథను భాగవతారిణి సీతాలక్ష్మి గానం చేశారు. మొక్కులున్న దాతలు ఆలయం వద్ద వెయ్యిమందికి పైగా అన్నదానం చేశారు.

మల్లారెడ్డికండ్రిగలో ఇంటింటి ఫీవర్ సర్వే



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యాధికారి విష్ణుప్రియ

విజయపురం (నగరి): మల్లారెడ్డికండ్రిగ గ్రామంలో ఆదివారం కూడా విజయపురం పీహెచ్‌సీ వైద్యాధికారి విష్ణుప్రియ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి మరోసారి వైద్య పరీక్షలు చేశారు. మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది స్థానికంగా ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. రెండు వారాలుగా మల్లారెడ్డికండ్రిగలో జ్వరాలు తగ్గకపోవడంతో మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌వో రవిరాజు పాల్గొన్న విషయం తెలిసిందే. ఆదివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎఎన్‌ఎం, ఆశవర్కర్లు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న 20 మంది నుంచి రక్తనమూన సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 24 గంటల సేపు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య అందిస్తారని, భయపడవల్సి అవసరం లేదని గ్రామస్తులకు వైద్యాధికారులు భరోసా కల్పించారు. శనివారం కంటే ఆదివారం ఆరోగ్యం మరింత మెరుగు పడిందని గ్రామస్తులు తెలిపారు. జ్వరం ఎక్కువ ఉంటే సొంత వైద్యం మాని వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి విష్ణుప్రియ సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఉదయం 11 తరువాత బయటకు వెళ్లకూడదని తెలిపారు.సీహెచ్‌వో సుబ్బరామమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



స్విమ్స్‌లో డాక్టర్లతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం)/వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేదలకు స్విమ్స్‌లో మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి వైద్యులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని ముక్కళత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రూబన్ కుమారుడు రాహుల్‌ను ఆదివారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వర్తించకపోయినా ఉచిత వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆయన ఆదేశించారు. అలాగే స్విమ్స్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేట గ్రామానికి చెందిన భాస్కర్‌ను డిప్యూటీ సీఎం పరామర్శించారు. భాస్కర్‌కు మెరుగైన వైద్యం అందించాలని గత నెలలో స్విమ్స్ డైరెక్టర్‌కు సిపార్సు లేఖ కూడా పంపారు. భాస్కర్‌ను పరామర్శించి వైద్య సేవలపై వాకబు చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పాలసముద్రం: అత్తిమాంజేరిపేట ప్రభుత్వం పాఠశాలలో 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక్కటయ్యారు. ఏజే పేట కల్యాణ మండపం వీరి కలయికకు వేదికైంది. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. అప్పట్లో విద్య నేర్పించిన గురువులు వరదరాజులునాయుడు, సురేంద్రబాబు, హేమభూషణ్, నరసింహమందడి, సుగుణకుమారికి పాద పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థి మునస్వామి వేదికపై మాట్లాడుతూ అప్పట్లో ఉపాధ్యాయులంటే భయపడి చదవడం వల్లనే మా బ్యాచ్‌లో చాలా మంది ఉపాధ్యాయులుగా, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లుగా స్థిర పడ్డామని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కృష్ణా, యమున జట్టు



టోర్నమెంట్‌లో పాల్గొన్న అండర్ -14, 16 జట్లు



నగరి: స్థానిక కేవీకే మైదానంలో సమ్మర్ క్యాంప్ క్రికెట్లో శిక్షణ పొందిన అండర్ –14, అండర్ –16 క్రీడాకారులకు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శాప్ క్రికెట్ టోర్నమెంట్ పేరిట పోటీలు నిర్వహించారు. అండర్ –14లో గోదావరి, కృష్ణా మధ్య జరిగిన పోటీలో కృష్ణా 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. అండర్–16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య పోటీ నిర్వహించగా యమున జట్టు 108 పరుగుల తేడాతో విజయంం సాధించింది. విజేతలైన జట్లకు బహమతులు అందిస్తామని శాప్ కోచ్ బాబు తెలిపారు.

ఆకట్టుకున్న బలిబండి కుంభాలు



ఆలయంలో పూజలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ మహాభారత ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం బలిబండి కుంభాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు భీముని వేషధారితో పాటు బలికూడును ఎద్ల బండ్లతో తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఉదయం ఆలయ ధర్మకర్త బండి ఉమాపతి రెడ్డి, ఆయన సతీమణి వాణి అమ్మవారికి అలంకరణ వస్తువులు వితరణగా అందజేశారు. అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న హరికథ కాలక్షేపం జరిగింది. సాయంత్రం యువత పెద్ద ఎత్తున బాణసంచా పేల్చుతూ బండి కుంభాలతో ఆలయ ఆవరణలోకి ప్రదర్శనగా తీసుకురావడం ఆకట్టుకుంది.

ఆశాజనకంగా మామిడి ధరలు

- ఫ్యాక్టరీలో తోతాపూరి టన్ను రూ.17 వేలు
- మండీల్లో బేనీషా టన్ను రూ.23 వేలు, చందూర రూ.15 వేలు
- కోతలకు సిద్ధమవుతున్న రైతులు



బేనీషా ప్యాకింగ్



పుత్తూరు మార్కెట్ యార్డులో కొనుగోళ్లు

పుత్తూరు రూరల్: గత వారం రోజులుగా ధరాఘాతంతో ఇబ్బందులు పడ్డ మామిడి రైతుకు ఊరట లభిస్తోంది. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. గత వారంలో జిల్లా ఉద్యానవన శాఖ, మార్కెటింగ్ ఆర్జేడీ అధికారులు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని మార్కెట్ యార్డుల్లో పర్యటించి వ్యాపారులకు, రైతులకు ఇచ్చిన ఆదేశాలు, సూచనలు కొంత మేర సత్ఫలితాలు ఇస్తున్నాయి. వారం రోజులుగా ఫల్ప్ ఫ్యాక్టరీల వద్ద రూ.11 వేలుకు పడిపోయిన తోతాపురి, ఆదివారం అన్ని ఫ్యాక్టరీలు టన్ను రూ.17 వేలు వంతున కొనుగోలు చేశాయి. మార్కెట్ యార్డుల్లోని మండీల్లో తోతాపూరి రూ.16 వేలు వంతున కొనుగోలు చేశారు. మామిడిలో రారాజైన బేనీషా రకం టన్ను రూ.23 వేలు పలికింది. చందూర రూ.15 వేలు అందుకొంది. విజయవాడ, కృష్ణగిరి, నూజివీడు నుండి సరుకు రావడం తగ్గడం కూడా ఇక్కడి పంటలకు రేట్లు పెరిగే అవకాశం ఏర్పడింది. ఇందుకు అనుగుణంగా గత కొద్ది రోజులుగా సబ్బుగా ఉన్న పుత్తూరు మార్కెట్ యార్డు నుంచి ఆదివారం గుజరాత్‌కు రెండు లోడ్లు కదిలాయి. ఇప్పటికే అకాల వర్షాలకు రాలిపోయిన పంటతో పాటు, నల్లమచ్చ కారణంగా రైతులు తొందర పడి కోతలు కోసి నష్టపోయారు. జిల్లాలో మిగిలి ఉన్న సగం పంటలకైనా గిట్టుబాటు ధరలు దక్కుతాయని రైతులు ఆశపడుతున్నారు. పుత్తూరు మార్కెట్ యార్డు పరిధిలో 8 జూస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటికి రైతులు నేరుగా సరుకు అందజేస్తే 30 రోజుల తర్వాత సొమ్ము చేతికి అందుతుంది. అదే మండీలకు ఇస్తే రెండు రోజుల్లో సొమ్ము లభిస్తుంది. మండీల్లో కేజీపై రూపాయి తక్కువ ధర అయినా వీటివైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో జూన్ మూడవ వారం నుంచి రైతులు కోతలకు ఉపక్రమించాలని అధికారులు సూచిస్తున్నారు.